అతిథి గృహం-అసాంఘిక నిలయం

- నాడు కాటన్ బస చేసిన గెస్ట్‌హౌస్
- నేడు అనైతిక కార్యక్రమాల కేంద్రం
- పట్టించుకోని ఇరిగేషన్ అధికారులు

ఆత్రేయపురం: కాటన్ బ్యారేజీ నిర్మించే సమయంలో కాటన్ బస చేసిన అతిథి గృహంగా పేరు గాంచిన లొల్ల లాకుల వద్ద కాటన్ అతిథి గృహం నేడు శిథిలస్థితికి చేరుకుని అసాంఘిక కార్యకలాపాలకు అడ్డగా మారింది. లొల్ల లాకుల వద్ద కాటన్ హయంలో నిర్మించిన అతిథి గృహం శిథిలస్థితికి చేరుకుంది. గత 25 ఏళ్ల క్రితం ఈ అతిథి గృహాన్ని ఆధునీకరించారు. ఈ అతిథి గృహంలో కొత్తపేట నియోజకవర్గంలో కొత్తపేట, ఆలమూరు, రావులపాలెం, ఆత్రేయపురం మండలాలకు చెందిన ఏ పార్టీ ప్రజా ప్రతినిధులైనా ఈ బంగ్లా ఆవరణలో సమావేశాలు నిర్వహించేవారు. అలనాడు మంత్రులు, ప్రజా ప్రతినిధులు, ఇంజినీరింగ్ ఉన్నతాధికారులు విశ్రాంతి తీసుకుని సమీక్షలు, సమావేశాలు నిర్వహించేవారు. రానురాను అతిథి గృహం వైపు ఎవరూ చూడకపోవడంతో రాత్రివేళల్లో అసాంఘిక కార్యకలాపాలు విచ్చలవిడిగా సాగిపోతున్నాయి. మద్యం, పేకాట, వ్యభిచారం వంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలకు ఈ వసతి గృహం కేంద్రంగా మారడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి హయంలో ఆధునీకరణ పనుల్లో భాగంగా కొత్తపేట, ఆత్రేయపురం, రావులపాలెం, ఆలమూరు మండలాల్లో సుమారు రూ.400 కోట్లు మంజూరు చేశారు. లాకుల వ్యవస్థతో పాటు కాటన్ అతిథి గృహం నిర్మించాలని ఈ ప్రాంతానికి చెందిన రైతులు కోరుతున్నారు. లొల్ల లాకులు పర్యాటకులను ఎంతో ఆకర్షించడంతో అతిథి గృహం నిర్మించాల్సిన అవసరం ఎంతైనా ఉందని పర్యాటక ప్రియులు కోరుతున్నారు. అసాంఘిక కార్యకలాపాలు నిరోధించేందుకు రాత్రివేళల్లో పోలీసులు గస్తీ లేదా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.


శిథిలావస్థకు చేరిన కాటన్ అతిథి గృహం

కఠినంగా వ్యవహరిస్తాం



లొల్లలాకులు ప్రాంతంలో రాత్రివేళల్లో అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే కఠిన చర్యలు చేపడదాం. రాత్రివేళల్లో పోలీసు గస్తీ నిర్వహిస్తాం. మద్యం, జూదం, వ్యభిచారం నిర్వహించే వ్యక్తులు ఎంతటివారైనా ఉపేక్షించేంది లేదని ఆయన హెచ్చరించారు.

– శ్రీనివాస్, ఎస్సై, ఆత్రేయపురం మండలం

ప్రతిపాదనలు పంపించాం



లొల్లలాకుల ఆధునీకరణకు ప్రతిపాదనలు పంపాం. ఆమోదం లభించిన వెంటనే లాకులు వ్యవస్థను పటిష్టం చేయడంతో పాటు అతిథి గృహం నిర్మాణానికి చర్యలు చేపడతాం.

– పిల్లా సత్యనారాయణ, ఇరిగేషన్ ఏఈ

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి


జి.అగ్రహారంలో వైద్యులకు సూచనలు చేస్తున్న సర్పంచ్ నాగేశ్వరరావు

అంబాజీపేట: నివాస ప్రాంతాలు, ప్రాంగణాల్లో ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పంచాయతీ కార్యదర్శి జీవీవీకే కుమార్ అన్నారు. మాచవరంలో పారిశుధ్య పనులను సోమవారం నిర్వహించారు. దోమలను నియంత్రించేందుకు చెత్తాచెదారం, నిల్వ నీటిని ఉంచరాదని ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం బ్లీచింగ్, ఎబేట్ మందు స్ప్రే చేయించారు.

జ్వరం వస్తే వైద్యులను సంప్రదించండి

ప్రస్తుత వాతావరణంలో డెంగీ, మలేరియా, విష జ్వరాలు ప్రబలుతున్న నేపథ్యంలో జ్వరం వస్తే వెంటనే వైద్యులను సంప్రదించి మెరుగైన వైద్యం చేయించుకోవాలని సర్పంచ్ దొంగ నాగేశ్వరరావు అన్నారు. గంగలకుర్రు అగ్రహారం శివారు జై భీమ్ నగర్‌లో నిర్వహిస్తున్న మెడికల్ క్యాంపును సోమవారం పరిశీలించారు. సర్పంచ్ మాట్లాడుతూ ప్రతి ఇంటిని సర్వే చేసి జ్వర పీడిత రోగులను గుర్తించి వైద్య సేవలందించాలన్నారు. ఈఓపీఆర్డీ బి.మమత, ఉప సర్పంచ్ బందన రాంబాబు, హెల్త్ సూపర్‌వైజర్లు, ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉపాధ్యాయుడికి సన్మానం


త్రినాథరావు దంపతులను సత్కరిస్తున్న సర్పంచ్ రామలక్ష్మి దంపతులు

కొత్తపేట: సమాజంలో యువతను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దేది ఉపాధ్యాయుడేనని అతిథులు మోడేకుర్రు సర్పంచ్ కె.రామలక్ష్మి, ఎంఈఓ ఎం.హరిప్రసాద్ అన్నారు. మండలంలోని మోడేకుర్రు శివారు రాకుర్తివారిపాలేనికి చెందిన జక్కంశెట్టి త్రినాథరావు కాకినాడ జిల్లా శంఖవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ (గణిత ఉపాధ్యాయుడు)గా పనిచేసి గత నెల 31న ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా ఆదివారం రాత్రి రాకుర్తివారిపాలెంలో గ్రామస్తులు, ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో సన్మానం చేశారు. అతిథులు మాట్లాడుతూ త్రినాథరావు కొత్తపేట, ముమ్మిడివరం, శంఖవరం మండలాల్లో సుమారు 26 ఏళ్ల పాటు ఉపాధ్యాయుడిగా పనిచేసిన త్రినాథరావు అంకిత భావంతో, విద్యార్థులు ఉత్తమ ఫలితాలతో ఉత్తీర్ణత సాధించేలా కృషి చేసేవారన్నారు. అనంతరం త్రినాథరావు దంపతులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో గ్రామ వీడీసీ కన్వీనర్ కుడుపూడి వెంకటేశ్వరరావు, యూటీఎఫ్, ఎస్టీయూ, విద్యాశాఖ విశ్రాంత అధికారులు పాల్గొన్నారు.

బాలిక వైద్యానికి రూ.52 వేల సాయం


బాలికకు సాయం అందిస్తున్న హెచ్ఎం సూర్యప్రకాశరావు

మామిడికుదురు: అరుదైన వ్యాధితో బాధపడుతన్న అప్పనపల్లి అరుంధతీపేటకు చెందిన 13 ఏళ్ల బాలిక ఆకుమర్తి జ్యోతి వైద్య ఖర్చులకు దాతలు సోమవారం ముందుకు వచ్చారు. ఆమె కుటుంబానికి రూ.52 వేలు ఆర్థికసాయం అందించారు. బాలిక తండ్రి రమేష్‌తో కలిసి 1999–2000లో అప్పనపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు రూ.50 వేల సహాయం అందించారు. స్కూల్ ప్రధానోపాధ్యాయులు బావరాజు సూర్యప్రకాశరావు రూ.2 వేలు సహాయం అందించారు. ఆ సహాయాన్ని జెడ్పీ ఉన్నత పాఠశాల వద్ద బాలిక జ్యోతితో పాటు ఆమె తండ్రి రమేష్, తల్లి శాంతికుమారికి అందించారు. దాతలను పలువురు స్థానికులు అభినందించారు. మానవతా దృక్పథంతో దాతలు సాయం అందించి బాలిక కుటుంబానికి అండగా నిలవాలని స్థానికులు కోరారు.

స్టాపర్లను ఢీకొట్టిన మోటారు సైక్లిస్టు

అంబాజీపేట: ముక్కామల నాలుగు రోడ్ల సెంటర్‌లో పోలీసులు ఏర్పాటు చేసిన స్టాపర్లను ఓ మోటారు సైక్లిస్టు సోమవారం బలంగా ఢీ కొట్టాడు. ఈ ఘటనలో మోటారు సైక్లిస్టుకు తీవ్ర గాయాలు కాగా అమలాపురం ఆస్పత్రికి 108లో తరలించారు. కాగా మోటారు సైక్లిస్టు వివరాలు తెలియాల్సి ఉందని పోలీసులు తెలిపారు.

తీర్మానం లేకుండా యానిమేటర్‌ను ఎలా నియమిస్తారు?


అంబాజీపేటలో ఏపీఎం గంగాధరరావును నిలదీస్తున్న డ్వాక్రా మహిళలు

అంబాజీపేట: డ్వాక్రా సంఘ సభ్యుల తీర్మానాలు, అనుమతులు లేకుండా కొత్త యానిమేటర్‌ను ఎలా నియమిస్తారని ఏపీఎం గంగాధరరావును నిలదీశారు. కె.పెదపూడికి చెందిన ఉదయ, అశ్విని, సౌభాగ్యలక్ష్మి, దుర్గ, రాజరాజేశ్వరి, శ్రీరామ్, సాయిలీల డ్వాక్రా గ్రూపులతో పాటు మరో 23 డ్వాక్రా సంఘాల మహిళలు అంబాజీపేట మండల ప్రజా పరిషత్ కార్యాలయం వద్ద సోమవారం ఆందోళన చేపట్టారు. అనంతరం మహిళలు విలేకరులతో మాట్లాడుతూ డ్వాక్రా సంఘ మహిళలకు తెలియకుండా ఏడాది క్రితం కొత్త యానిమేటర్‌ను ఏపీఎం నియమించారన్నారు. యానిమేటర్‌ను మారుస్తున్నామని సమావేశం ఏర్పాటు చేసి వివరిస్తే మాకు కొత్త యానిమేటర్ వద్దని, ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న యానిమేటర్ విజయను కొనసాగించాలని ఎటువంటి తీర్మానాలు చేయకుండా అక్కడి నుండి బయటకు వచ్చామని మహిళలు చెప్పారు. పాత యానిమేటర్ కావాలని చెప్పినా మీరు ఎందుకు కొత్త యానిమేటరు గురించి మాట్లాడుతున్నారని నిజాలు చెప్పాలని, అబద్ధాలు చెప్పవద్దంటూ ఏపీఎంపై మహిళలు మరింత ఆగ్రహం వ్యక్తం చేశారు. కొత్త యానిమేటర్‌ను కొనసాగించకుంటే మీకు ఎటువంటి డ్వాక్రా లోన్లు రాకుండా చేస్తానని, ఏ సంక్షేమ పథకం అందదని హెచ్చరించారన్నారు. ఈ విషయంపై అడిగితే మీ డ్వాక్రా గ్రూపును రద్దు చేస్తామని బెదిరించారన్నారు. 11 నెలలుగా ఈ సమస్యను పరిష్కరించకుండా మాకు ఏదో ఒక కారణం చెప్పి ఏపీఎం తప్పించుకుంటున్నారని మహిళలు విమర్శించారు. స్త్రీ నిధిలో ఎటువంటి అప్పులు లేకపోయినప్పటికీ స్త్రీనిధి ఏజీఎం, ఏపీఓలు వచ్చి అప్పు కట్టాలని లేని పక్షంలో మీపై కేసులు నమోదు చేస్తామని, బెదిరించారని, దురుసుగా మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. మాకు పాత యానిమేటర్‌ను కొనసాగించాలని లేని పక్షంలో జిల్లా కలెక్టర్ వద్దకు వెళ్లి ఫిర్యాదు చేస్తామని మహిళలు హెచ్చరించారు. దీనిపై ఏపీఎంను వివరణ కోరగా డ్వాక్రా సంఘాల సభ్యులకు కొత్త యానిమేటర్‌ను పరిచయం చేశామన్నారు. అలాగే త్వరలో డ్వాక్రా మహిళలతో సమావేశం ఏర్పాటు చేసిన సమస్యను పరిష్కరిస్తానన్నారు.

గోదావరి కోతపై రైతుల ఆందోళన


నదీకోతను నివారించాలంటూ ధర్నా చేస్తున్న రైతులు

మామిడికుదురు: గోదావరి కోత తీవ్రంగా ఉందని, దాని నివారణకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ పాశర్లపూడి బాడవలో రైతులు సోమవారం ధర్నా చేశారు. వైనతేయ వారధి వద్ద నిరసన తెలిపారు. గోదావరి కోత నివారణకు గ్రోయన్లు, రివిట్‌మెంట్ నిర్మించాలని కోరారు. ఇటీవల వచ్చిన గోదావరి వరదకు నదీకోత తీవ్రమైందని ఆందోళన వ్యక్తం చేశారు. రూ.కోట్లు విలువైన భూములు నదీగర్భంలో కలసి పోయాయని, నెల నెలా ఆదాయాన్ని ఇచ్చే కొబ్బరి చెట్లు నదిలో పడిపోయాయని వాపోయారు. ఈ సమస్య పరిష్కారంపై తక్షణం ప్రభుత్వం స్పందించాలని రైతులు డిమాండ్ చేశారు. ధర్నాలో రైతులు తోరం నాగేంద్ర, మల్లాడి విష్ణు, నిమ్మల అప్పారావు, చవటపల్లి బులిబాబులు, మల్లాడి వీరపండు, పాలూరి సత్తిబాబు, పెమ్మాడి రామ్మూర్తి, మట్లాడి వీర్రాజు, తదితరులు పాల్గొన్నారు.

పూడుకుపోయిన డ్రెయిన్‌తో ఇక్కట్లు


మోరి శివాలయం ప్రహరీకి చేర్చి పూడుకున్న డ్రెయిన్

సఖినేటిపల్లి: మోరి నడిబొడ్డున ఉన్న మీడియం డ్రెయిన్‌లో ముంపు నీరు సక్రమంగా ప్రవహించక గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పూర్వం వీవీ మెరక సరిహద్దు నుంచి మోరి మొండికోడు చానల్ వరకూ సుమారు మూడు కిలోమీటర్ల మేర ఈ డ్రెయిన్ ఏర్పాటు చేశారు. ఈ రెండు గ్రామాల్లో ముంపునీరు డ్రెయిన్ ద్వారా మొండికోడు చానల్‌లోకి చేరే విధంగా అప్పట్లో మార్గం ఏర్పాటు చేశారు. అయితే దశల వారీగా చేస్తున్న మరమ్మతులు ఫలితాలను ఇవ్వడం లేదు. దీనికి తోడు చెత్తాచెదారం అంతా డ్రెయిన్‌లోకి చేరుతుండడంతో భారీ వర్షాల సమయంలో డ్రెయిన్‌లో ముంపు నీరు పొంగి రోడ్డుపైకి, నివాస గృహాల వద్దకు చేరుతోంది. ప్రధానంగా డ్రెయిన్ ఆనుకుని మోరి పరిధిలో పూర్వం నాటి శివాలయం ఉంది. శివాలయంలోని వాడకం నీరు డ్రెయిన్‌లోకి వెళ్లడానికి ఏర్పాటు చేసుకున్న తూరలు ద్వారా డ్రెయిన్‌లోని వర్షం ముంపు నీరు మొత్తం వెనక్కి పోటెత్తి ఆలయం ప్రాంగణం అంతా ముంపు నీటితో నిండిపోతోంది. దీంతో స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులకు తీవ్ర అసౌకర్యంగా మారింది. డ్రెయిన్‌ను స్థానిక పంచాయతీ, సదరు శాఖ పర్యవేక్షించి ముంపు నీరు సక్రమంగా దిగేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

శ్రావణ మాస పూజలు ప్రారంభం

అయినవిల్లి: నల్లచెరువు వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో శుద్ధ పాడ్యమి సోమవారం సందర్భంగా శ్రావణ మాస పూజలు ప్రారంభించారు. ఆలయ అర్చకుడి ఆధ్వర్యంలో ఈ పూజలు ప్రారంభమయ్యాయి. పద్మావతి అమ్మవారికి తెల్లవారుజామున 6.30 గంటల నుంచి కుంకుమ పూజలు విశేషంగా జరిపారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. శ్రావణమాసం అంతా అమ్మవారికి విశేష పూజలు నిర్వహిస్తామన్నారు.

శివాలయాల్లో ప్రత్యేక పూజలు

సఖినేటిపల్లి: శ్రావణ మాసం ప్రారంభం సోమవారం కావడంతో శివాలయాలు భక్తులతో రద్దీగా మారాయి. శివునికి సోమవారం ప్రీతికరమైనది కావడంతో అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి స్వామి, అమ్మవార్లకు పూజలు నిర్వహించారు. ప్రముఖమైన మోరి, అంతర్వేది, గుడిమూల శివాలయాలతో పాటు పలు ఆలయాలకు భక్తులు పోటెత్తారు. స్వామికి మారేడు దళాలతోను, అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు.

పేదలకు సాయం పంపిణీ


పేదరాలికి సాయం చేస్తున్న అనిల్

సఖినేటిపల్లి: రామేశ్వరం విలేజ్ వెల్ఫేర్ ట్రస్ట్ ఆధ్వర్యాన సోమవారం గ్రామ పంచాయతీ వద్ద నిర్వాహకులు 100 మంది పేదలకు సాయం పంపిణీ చేశారు. ఒక్కొక్కరికీ రూ.100 నగదు, 5 కేజీల బియ్యం చొప్పున అందజేశారు. కాగా దాతల సాయంతో గత 12 ఏళ్లుగా ప్రతి నెలా ట్రస్ట్ ద్వారా సేవా కార్యక్రమాలు చేస్తున్నట్లు ట్రస్ట్ ఫౌండర్ సరెళ్ల విజయ్ ప్రసాద్ తెలిపారు. ఈ నెలకు గాను సేవా కార్యక్రమాలకు దుబాయ్‌లోని తెలుగు క్రైస్తవ సంఘం ప్రతినిధి మోకా అనిల్ రూ.10 వేలు విరాళంగా అందజేశారన్నారు. అసోసియేషన్ సభ్యుడు బళ్ల లక్ష్మణ్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధి పనుల పరిశీలన

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణలో జరుగుతున్న అభివృద్ధి పనులను దేవదాయ ధర్మదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, ఈవో భూపతిరాజు కిషోర్‌కుమార్ సిబ్బందితో కలసి పరిశీలించారు. అర్చకులకు నిర్మిస్తున్న ఇళ్లు, రోడ్ల పనులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షకులు శ్రీనివాస్, వర్మ తదితరులు ఉన్నారు.

ఏఎస్సైపై దౌర్జన్యం చేసిన వ్యక్తిపై కేసు

అంబాజీపేట: విధులు నిర్వహిస్తున్న ఏఎస్సై పై దౌర్జన్యం చేసి విధులకు ఆటంకం కలిగించిన ఓ వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై కె.చిరంజీవి తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గంగలకుర్రుకు చెందిన బూడిద విజయ్ అదే గ్రామానికి చెందిన ఓ అమ్మాయితో ఈ నెల 3 అర్ధరాత్రి ఆమె ఇంటి వద్ద మాట్లాడుతుండగా అర్ధరాత్రి వేళ మా ఇంటి వద్ద పనేంటని విజయ్‌ను ఆమె తల్లిదండ్రులు అడిగారన్నారు. దాంతో ఆమె తల్లితండ్రులపై విజయ్ ఘర్షణకు దిగాడన్నారు. అమ్మాయి తల్లిదండ్రులు అంబాజీపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో ఏఎస్సై సూర్యనారాయణ సంఘటన స్థలానికి చేరుకుని విచారిస్తున్నాడన్నారు. విధులు నిర్వహిస్తున్న ఏఎస్సైపైకి విజయ్ దురుసుగా వచ్చి దౌర్జన్యం చేయగా పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చామన్నారు. మద్యం మత్తులో పోలీస్ స్టేషన్‌లో ఉన్న అద్దాన్ని విజయ్ తలతో బలంగా ఢీ కొట్టాడన్నారు. ఏఎస్సై ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి అమలాపురం కోర్టుకి తరలించినట్లు ఎస్సై తెలిపారు.

యోగాతో ఏకాగ్రత, ఉత్తమ ఫలితాల సాధన


కొత్తపేట డిగ్రీ కళాశాలలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపాల్

కొత్తపేట: విద్యార్థులు ప్రతి రోజూ యోగా, వ్యాయామం చేయడం వలన చదువులో ఏకాగ్రత పెరుగుతుందని, తద్వారా ఉత్తమ ఫలితాలు సాధిస్తారని స్థానిక వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.పెద్దిరాజు అన్నారు. కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ కార్యక్రమాల్లో భాగంగా సోమవారం కళాశాలలో 'యోగా–ఆరోగ్యం' పై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ రోజూ యోగా చేయడం వలన మానసికస్థితి మెరుగుపడుతుందన్నారు. కొందరికి చదువులో లేదా తాము చేసే పనులపై ఏకాగ్రత గణనీయంగా పెరుగుతుందన్నారు. అనంతరం యోగాపై పోస్టర్ ప్రజెంటేషన్ పోటీల్లో విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లను అందజేశారు. ఎన్ఎస్ఎస్ పీఓ. డీసీహెచ్ పాపారావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ టి.రమాదేవి, పలువురు అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు శాంతి ర్యాలి

అంబాజీపేట: ఇటీవల కేరళ రాష్ట్రం వయనాడ్‌లో ప్రకృతి విపత్తుల కారణంగా మృతి చెందిన వారికి సంతాపం వ్యక్తపరుస్తూ అఖిల పక్షం, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో సోమవారం శాంతి ర్యాలీ నిర్వహించారు. నాలుగు రోడ్ల సెంటర్ నుండి బస్టాండ్ వరకు మృతి చెందిన వారి ఆత్మకు శాంతి చేకూరాలంటూ ర్యాలీ చేపట్టారు. కోకోఫెడ్ చైర్మన్ అరిగెల బలారామమూర్తి, పే బ్యాక్టు సొసైటీ ఆర్గనైజేషన్ ప్రతినిధి నక్కా భాస్కర్, ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి, దొమ్మేటి సత్య మోహన్, విత్తనాల ఇంద్రశేఖర్, కొర్లపాటి కోటబాబు తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాల సంస్కృతిపై అవగాహన కల్పిద్దాం


పినపళ్లలో తల్లులకు అందజేస్తున్న పౌష్టికాహార కిట్లు


మాకనపాలెంలో నిర్వహించిన తల్లి పాల వారోత్సవం

ఆలమూరు: తల్లిపాల సంస్కృతిపై ప్రజల్లో అవగాహన కల్పించి తల్లీబిడ్డల ఆరోగ్యాన్ని సంరక్షిద్దామని పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారి డి.సాయికిషోర్ అన్నారు. మండలంలోని పినపళ్లలో సర్పంచ్ సంగిత సుభాష్, ఎంపీటీసీ పెద్దిరెడ్డి పట్టాభి ఆధ్వర్యంలో నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల్లో వైద్యాధికారి సాయికిషోర్, మలేరియా యూనిట్ అధికారి సీహెచ్ వెంకటేశ్వరరావు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఆయా అంగన్‌వాడీ కేంద్రాల్లో బాలింతలు, గర్భిణులకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో తల్లి తన బిడ్డకు పాలివ్వడం ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించి ముర్రుపాలు విశిష్టతను తెలియజేశారు. తల్లిపాలలో ప్రొటీన్లు, రోగ నిరోధక శక్తిని పెంచే విటమిన్లు అధికశాతం ఉంటాయన్నారు. అనంతరం అంగన్‌వాడీ కార్యకర్తలు వి.రాజేశ్వరి, బి.వెంకట పద్మావతి, జి.రాఘవ సమకూర్చిన పౌష్టికాహార కిట్లను గర్భిణులు, బాలింతలకు అందజేశారు. ఏఎంసీ మాజీ చైర్మన్ వక్కపట్ల లక్ష్మణరావు, సీహెచ్ఓ పి.రాధాకృష్ణ, హెల్త్ విజిటర్ పి.ఉమ, ఎంపీహెచ్ఏ కె.వెంకాయమ్మ, ఎంఎల్‌హెచ్‌పీ కె.కళాంజలి, యానిమేటర్లు, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

తల్లి పాలు బిడ్డకు శ్రేయస్కరం

మామిడికుదురు: తల్లి పాలలో ఎన్నో పోషక విలువలు ఉన్నాయని, తల్లి పాలే బిడ్డకు శ్రేయస్కరమని ఎంఎల్‌హెచ్‌పీ ఎస్.అరుణ, హెల్త్ అసిస్టెంట్ కె.ఉమామహేశ్వరరావు సూచించారు. మాకనపాలెంలోని ప్రధాన అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం తల్లిపాల వారోత్సవం జరిగింది. తల్లి పాల ప్రాధాన్యతను బాలింతలు, గర్భిణులకు వివరించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం వై.లావణ్య, అంగన్‌వాడీ కార్యకర్త కేపీ మంగతాయారు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

సఖినేటిపల్లిలో..

సఖినేటిపల్లి: శిశువులకు తల్లిపాలు వ్యాధి నిరోధక శక్తిని పెంచుతాయని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షేక్ మీరా మున్నీసా అన్నారు. సోమవారం అప్పనరామునిలంక శివారు పల్లిపాలెం అంగన్‌వాడీ కేంద్రం వద్ద ఐసీడీఎస్ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. హెల్త్ సూపర్‌వైజర్ పీఎల్ఎన్ స్వామి, ఏఎన్ఎం బి.ప్రవీణ, హెల్త్, వెల్నెస్ సీహెచ్ఓ ఎం.మమత, అంగన్‌వాడీలు, ఆశాలు పాల్గొన్నారు.

సాయం చేస్తున్నట్టు నటించి సొమ్ము స్వాహా

పి.గన్నవరం: స్థానిక యూనియన్ బ్యాంక్ ఏటీఎంలో నగదు తీసేందుకు సాయం చేస్తున్నట్టు నటించి ఇద్దరు వ్యక్తులు రూ.9 వేలు స్వాహా చేసిన ఘటన సోమవారం పి.గన్నవరంలో జరిగింది. మండలంలోని వై.కొత్తపల్లికి చెందిన తోరం నాగ వెంకట దుర్గాదేవికి స్థానిక యూనియన్ బ్యాంక్‌లో ఖాతా ఉంది. సోమవారం ఉదయం బ్యాంకు ఆవరణలో ఉన్న ఏటీఎంకు కుమారుడు ఫణీంద్ర గణేష్ కుమార్‌తో ఆమె వచ్చారు. వారు నగదు తీసుకునేందుకు ఇబ్బంది పడటంతో.. అక్కడే ఉన్న ఇద్దరు యువకులు సాయం చేసి రూ.5 వేలు తీసి ఇచ్చారు. ఈ క్రమంలో ఏటీఎంలో సాయం చేసిన గుర్తు తెలియని యువకులు దుర్గాదేవి కార్డు తీసుకుని, తమ వద్ద ఉన్న మరో కార్డు ఇచ్చి వెళ్లిపోయారు. 11 నిమిషాల అనంతరం గుర్తు తెలియని వ్యక్తులు వేరే ఏటీఎంకు వెళ్లి రూ.9 వేలు కాజేశారు. నగదు విత్‌డ్రా చేసినట్టు దుర్గాదేవి భర్త వద్ద ఉన్న సెల్‌కు మెసేజ్ వెళ్లడంతో వెంటనే అలెర్ట్ అయి కార్డు బ్లాక్ చేయించారు.

పిచ్చుకలంక వద్ద టూరిజం అభివృద్ధికి చర్యలు


పిచ్చుకలంక వద్ద స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో సత్యనారాయణ

ఆత్రేయపురం: మండలంలోని బొబ్బర్లంక శివారు పిచ్చుకలంక వద్ద టూరిజంకు ప్రతిపాదనలు వచ్చినట్లు కొత్తపేట ఆర్డీఓ జీవీవీ సత్యనారాయణ తెలిపారు. సోమవారం ఆయన పిచ్చుకలంక వద్ద సర్వే నెంబర్ 155లో 56 సెంట్లు టూరిజం అభివృద్ధి కోసం నిర్ణయించిన స్థలాన్ని పరిశీలించారు. ఆయన వెంట మండల సర్వేయర్ పద్మావతి, ఆర్ఐ భవాని, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

నూతన ఎస్సైల నియామకం


సురేంద్ర

కొత్తపేట: స్థానిక నూతన ఎస్సైగా జి.సురేంద్ర నియమితులయ్యారు. పోలీసు అధికారుల బదిలీల్లో భాగంగా ద్రాక్షారామ ఎస్సైగా పనిచేసిన సురేంద్రను కొత్తపేట స్టేషన్‌కు బదిలీ చేయగా ఇంతవరకూ ఇక్కడ ఎస్సైగా పనిచేసిన ఎం.అశోక్‌ను ఆలమూరు పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు. ఈ ఇద్దరు ఎస్సైలు ఆయా స్టేషన్లలో బాధ్యతలు స్వీకరించవలసి ఉంది.

భగవన్నారాయణకు ఎస్సైగా పదోన్నతి


భగవన్నారాయణ

అంబాజీపేట: స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏఎస్సైగా విధులు నిర్వహిస్తున్న పి.భగవన్నారాయణకు ఎస్సైగా పదోన్నతి పొందారని ఎస్సై కె.చిరంజీవి తెలిపారు. కృష్ణా జిల్లా మచిలీపట్నానికి భవన్నారాయణ ఎస్సైగా పదోన్నతిపై వెళుతున్నారన్నారు. ఎస్సైతో పాటు ఏఎస్సై సూర్యనారాయణ, హెచ్‌సీలు, కానిస్టేబుల్స్ భవన్నారాయణకు అభినందనలు తెలిపారు.

అజ్ఞాన నిర్మూలనకు అమావాస్య చిహ్నం


అంబాజీపేటలో ప్రసంగిస్తున్న చంద్ర కాళీప్రసాద్ మాతాజీ

అంబాజీపేట: మానవులలో నెలకొని ఉన్న అజ్ఞానాన్ని గురుదేవులు మాత్రమే జ్ఞానాంజన శలాకతో తొలగించగలరని నంబూరుకు చెందిన హనుమత్ కాళీ వరప్రసాద్ బాబూజీ మహరాజ్, కాళీ వనాశ్రమ పీఠాధిపతులు పుణ్యశ్రీ యోగినీ చంద్రకాళీ ప్రసాద్ మాతాజీ అభిలషించారు. అంబాజీపేటలో జరుగుతున్న సత్సంగంలో భాగంగా సోమవారం స్థానిక బొండాడ సురేంద్ర బాబూరావు స్వగృహంలో భక్తులను ఉద్దేశించి మాట్లాడారు. అమావాస్య అజ్ఞాన నిర్మూలనకు చిహ్నమని దానిని తొలగించడానికి మానసికంగా శాశ్వత జ్యోతి కనుగొనడం సాధకుడి కర్తవ్యమని, శ్రవణమే బోధ స్వరూపంలో అందుకు సాధనం కావాలని తెలియజేశారు. ఈ సత్సంగంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కాగా 6న శ్రావణ మంగళవారాన్ని పురస్కరించుకుని ఉదయం 10 గంటల నుంచి స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయ ప్రాంగణంలో అమ్మవారికి సామూహిక కుంకుమ పూజలు, సద్గురుదేవుల పాద పూజ, మహా ప్రసాద వితరణలు నిర్వహించనున్నట్లు బాబూ భక్త సమాజ్ సభ్యులు తెలిపారు.

రైతులు ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలి


పొదలాడలో ఈ-క్రాప్ నమోదు చేస్తున్న వ్యవసాయాధికారులు

రాజోలు: వరినాట్లు వేసిన ప్రతి రైతు ఈ–క్రాప్ నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి వై.మధుకుమార్ తెలిపారు. సోమవారం ఆయన మండలంలో జరుగుతున్న ఈ–క్రాప్ నమోదు వివరాలను పరిశీలించారు. ఈ–క్రాప్ నమోదు చేసుకోవడం వల్ల పంటల ఇన్‌పుట్ సబ్సిడీ, ఉచిత పంటల బీమా, ధాన్యం కొనుగోళ్లు, రాయితీపై ఎరువులు, విత్తనాలు రైతులు పొందవచ్చన్నారు. ఈ–క్రాప్‌లో రైతులు వివరాలు నమోదు చేసుకోకపోతే ప్రభుత్వం ద్వారా పొందే ఎలాంటి రాయితీలు మంజూరు కావని రైతులకు వివరించారు. పొదలాడ వీఏఏ నాగ తరుణ్, రైతులు పాల్గొన్నారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు

మామిడికుదురు: భారీ వర్షాల నేపథ్యంలో అంటువ్యాధులు ప్రబలకుండా ఈదరాడలో ముందస్తు చర్యల్లో భాగంగా పారిశుధ్య పనులు ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా గ్రామంలోని ప్రతి ఇంటి వద్ద బ్లీచింగ్ చల్లించి పరిసరాలను పరిశుభ్రం చేస్తున్నారు. దోమల నిర్మూలన చర్యల్లో భాగంగా ఎబేట్ మందు స్ప్రే చేయిస్తున్నారు. మలాథియాన్‌తో పాటు మురుగు నీటి గుంతల్లో ఆయిల్ బాల్స్ విడుదల చేస్తున్నారు. సర్పంచ్ చుట్టుగుళ్ల లక్ష్మి ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శి పీవీఆర్‌కే రాజు పర్యవేక్షణలో పారిశుధ్య పనులు చేపట్టారు.

యువతికి పాముకాటు

పి.గన్నవరం: మండలంలోని నాగుల్లంక గ్రామానికి చెందిన కె.వెంకటేశ్వరి (18) ఏళ్ల యువతి ఆదివారం రాత్రి తన ఇంటి వద్ద పాముకాటుకు గురైంది. దీంతో ఆమెను కుటుంబ సభ్యులు రాజోలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ నుంచి అమలాపురం ఏరియా ఆస్పత్రికి తీసుకువెళ్లారు. మెరుగైన వైద్యం కోసం ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతోంది.